**బాలమిత్ర, జి. రామలక్ష్మి - హైదరాబాదు**

## దైవసన్నిధి

ఒకసారి బాబా తిరగతిలో గోధుమలు పోస్తూ విచిత్రమైన రీతిలో విసరసాగారు. అంతలో అటుగా పోతున్న ఓ భక్తురాలు బాబాని చూసి, "బాబా! మీకిదేం అవస్థ! మేము లేమా ఈ పనులు చేయడానికి? మీరలా వెళ్ళి కూర్చోండి. నేను విసురుతాను గోధుమలు" అంటూ ఆ తిరగలి ముందు తాను కూర్చుని బాబాని లేపింది. గోధుమలు పోస్తూ విసరసాగింది.

అంతలో అక్కడికి హేమాద్రిపంతు వచ్చాడు. బాబా వద్ద కూర్చుని కాళ్ళు పిసుకుతూ బాబాతో ఆ మాటా, ఈ మాటా మాట్లాడుతున్నవాడల్లా ఉన్నపళంగా ఘొల్లుమన్నాడు ఏడుస్తూ.

అది చూసిన బాబా కంగారుపడి "ఏం జరిగింది పంతూ! ఎందుకలా ఏడుస్తున్నావు?" అంటూ అడిగారు.

"బాబా ఆ తిరగలి విసురుతన్న వనిత నా కంటికి మృత్యుదేవతవలే కనిపిస్తోంది. ఆ తిరగలిలో వేస్తూ విసురుతూ నలుపుతున్న గోధుమగింజలు నా కంటికి జీవులవలె అగుపిస్తున్నారు. మరి రేపు నా గతీ అంతేకదా! ఆ రాయిలో పడిన జనన మరణముల మధ్య కొట్టుమిట్టాడుతున్న జీవులవలె నేనూ అలా నలగవలసిందేనా? నాకు మరణము తప్పదా, ఏనాటికయినా..." అని చెపుతూ బావురుమన్నాడు పంతు.

అది విన్న సాయిబాబా చిరునవ్వు నవ్వి "పంతూ! మావుందయ్యా నీ బాధ. జనన మరణాలన్నది దైవం నిర్ణయించింది. ఎవరికి ఏ విధంగా మరణం వ్రాసివుంటే ఆ విధంగా జరగక తప్పదు. ఇకపోతే - చావుపుట్టుకలు ప్రతి జీవికి, ప్రతి ప్రాణికి తప్పవు. బ్రతికినంతకాలమే మరి ఏ మంచిపనులు చేసినా, చేయగలిగినా. అదీగాక శరీరము దాల్చిన నా దేహానికి తప్పదు మరణం. దేహం, శరీరము శుష్కించి నవిస్తుందే కానీ జీవుడు అంటే ఆత్మ నశించదు. మళ్ళీ అది మరో వేషం ధరిస్తుంది" అంటూ నచ్చచెప్పి, అతనిని బాబా ఆ వనిత దగ్గరగా నడిపించుకుని వెళ్ళి, ఆమె విసరే తిరగలి మధ్యగల గురుజు చుట్టూ నలగక భద్రంగా మిగిలివున్న కొన్ని గింజలను పంతుకు చూపించి, "గురుజు నాశ్రయించిన ఆ గింజలు చూడు ఎంత క్షేమంగా, భద్రంగా ఉన్నాయో. అలాగే 'దైవసన్నిధి'ని ఆశ్రయించిన జీవులు యీ జనన మరణాలనుండి సురక్షితంగా రక్షింపబడి గమ్యమును చేరుదురు" అని చెప్పారు.

అప్పటికి హేమాద్రిపంతు మనసు కుదుట పడిరది.

“నిజమే బాబా! మీరుండగా అటువంటి ఆలోచన నాలో రావటమే నా అవివేకతను నిరూపిస్తోంది. దైవసన్నిధి విలువ, దైవ ఆశ్రయం విలువ బాగా తెలియజేసారు. ఇకపై మీ పాదాలు విడిచిపెట్టను” అంటూ బాబాను చుట్టేసాడు పంతు.

బాబా తన బోధనలతో, సలహాలతో, సమాధానాలతో భక్తుల హృదయాలను కదిలించేసేవారు.